# బూడిద

అప్పటికి యాభయొకటవ రోగిని చూసి విసిగిపోయి, వేసారిపోయి వేదాంత ధోరణిలో పడిపోయేడు గవర్నమెంటు డాక్టరు దయానందరావు.

యాభయొకటవ రోగి తనకున్న రోగాల లిస్టు ఏకరువు పెడుతున్నాడు.

"కడుపులో మంటండీ.... తల తిరిగిపోతదండి– కండ్లమీదికి నిద్ర రావడం లేదు– రక్తం పోటు– ఒంటినిండా దురద – నాలిక పీక్కుపోయే దాహం – ఉత్తిగనే పిడికిల్లు బిగుసుకపోతాయి... కా...ళ్లు."

డాక్టరుగారు కాగితపు ముక్కమీద తలవంచి యమ సీరియస్‌గ గీకుతూ ఎందుకో యాభయొకటవ వ్యక్తిని ఎగాదిగా చూశాడు... యాభయొకటవ వ్యక్తి కాగితపు ముక్కను చూస్తున్నాడు. అది మశూచి నివారణ అడ్వర్టయిజ్‌మెంటు వాల్‌పోస్టరు ముక్క. ఆ ముక్కలో మశూచి పొక్కులున్నాయి. మల్లీ ఏదో జ్ఞప్తికొచ్చి యాభయొకటవ వ్యక్తి –

"మరండీ కాళ్లు పీకుతుంటాయి.... కడుపులో...."

డాక్టరు చీటి గీకి యిచ్చేశాడు.

"సూది రాశారాండీ...."

"రాశాను పోవయ్యా..."

యాభయొకటవ రోగి వెళ్లిపోయాడు. డాక్టరు రావు బయటకు చూశాడు. క్యూ మెయినుగేటు దాటింది.... "వీళ్లందరినీ చూడకుండా పంపించెయ్యాలంటే కూడా రెండు రోజులు కావాలి.... చూసైతే మరో యాభయి మంది డాక్టర్లు కావాలి".

అంతలోనే ఫోను.....

"స్థానిక ఎమ్మెల్యేగారి బామ్మర్దిగారి కొడుకు కొడుక్కు అజీర్ణమట... దానికి పనిలేని ఎమ్మెల్యేగారి రికమెండేషన్..." అనుకుంటూ వచ్చి చేర్‌లో కూలబడిపోయాడు.

ఇందాక గీచిన చీటీ యాభయి రెండవ వ్యక్తి చేతికిచ్చాడు డాక్టరు.... లేవబోయాడు....

"రోగం నాక్కాద్దొర! మా అయ్యకు."

"మీ అయ్యేడి?"

"ఆవల్నే కింద పడిపోయిండు దొరా...."

"సీరియస్సా"

ఆ మాట అర్థంకాక యాభయి రెండవ వ్యక్తి సీరియస్సయిపోయాడు.

"ఏం రోగం?"

"జెరం"

"ఇగో ఈ బిళ్లేసుకొని పడుకోమను. పాలు బాగా తాగమను"

"పాలెడియి బాంచెన్- అంబట్ల కుప్పులేనోళ్లం. ఆరు దినాల నుంచి ఆని శరీరం పెనం తీర్గ కాలిపోతంది. అచ్చెపోయె పాణం మీనున్నడు దొరా."

"తగ్గిపోతుందిలే."

"జెరం దొరా."

"అవునయ్యా జెరమే. జెరం మనిషికి రాకుంటే మాకు కొస్తదా? తగ్గిపోకుంటే ఏం జేస్తుంది? అదే తగ్గిపోతదిలే." రెండు రోజుల క్యాను చూడకుండా అర్జంటుగా ఎమ్మెల్యేగారింటికి, అక్కడి నుంచి వారి బామ్మర్దిగారింటికి అక్కడినుంచి.... వారి కొడుకుగారింటికి వెళ్లిపోయేడు డాక్టర్ దయానందరావు.

❖ ❖ ❖

రెండవనాడు.

యాభై రెండవ వ్యక్తి...

"మా అయ్యకు జెరం జారలే దొరా?"

"జార్తదా మరి... మనిషా? మాకా?" డాక్టరు దొర మళ్లో బిళ్లిచ్చాడు.

❖ ❖ ❖

మూడవనాడు

"గుడ్లు తేలేసిండు బాంచెన్..." యా. రెం. వ్య.

తేలెయ్యడా మరి... మనిషా? మాకా? డాక్టర్ ద.రా. మూడు బిళ్లలిచ్చాడు.

❖ ❖ ❖

అయిదవనాడు యాభై రెండవ వ్యక్తి చాలా ఆలస్యంగా వచ్చాడు. అతని కండ్లు చింతనిప్పుల్లా కణకణలాడుతున్నాయి. అతని పెరిగిన జుట్టూ చెదిరిపోయి చాలా వికారంగా ఉంది. ఒంటినిండా చిరుగుల పాత పంచె తప్ప మరేది లేదు. చేతిలో మాత్రం మురికిపట్టిన పాతగుడ్డ ముక్కలో ఏదో వున్నట్టున్నది.

"మా అయ్య సచ్చిండు డాకుటరు..."

"సావడా మరి.... మనిషా?... మాకా?..." డాక్టరు పరపర రాస్తున్నాడు.

"సావటమే కాద్దొర... సచ్చి బూడిదైపోయిండు..." అని చేతిలో ఉన్న పాత గుడ్డ మూట విప్పి నున్నటి టేబుల్‌మీద పారబోశాడు.

బూడిద ఎ.సి.పి.గోళీల డబ్బామీద, మశూచి నివారణ అడ్వర్టయిజ్‌మెంటు వాల్‌పోస్టరు బాపతి చిట్టీల మీద, డాక్టరు మెడకున్న స్టెతస్కోపు మీద, డాక్టరుగారి పాల నురుగులాంటి పాలిస్టర్ షర్టుమీద, నెట్టెడు ప్యాంటుమీద... ఆఖరుకు అతని ఎర్రటి ముఖమ్మీద, కళ్ళద్దాలమీద బూడిద.

డాక్టరుగారికి రోగులంతా బూడిద రోగుల్లా మసగ్గా కనిపించారు. అలాగే బయటికి చూశాడు. మెయిన్‌గేటు దాటి యాభయి రెండవ వ్యక్తి బూడిద ముద్దలాగా ఏడుస్తూ వెళ్లిపోతున్నాడు.

అతని ముందు (ఎన్నో నంబరో అతనిది) రోగి దీనాతిదీనంగా నిల్చున్నాడు పాపం ఆశతో...

❄

ఆంధ్రజ్యోతి వారపత్రిక 16-03-1979